క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పెదపూడి: సంపర గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారికి శనివారం పంచామృతాభిషేకం పూజలు చేశారు. తులసిదళాలను సమర్పించారు. అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారికి గోవిందనామ స్మరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అంగన్‌వాడీ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

పెదపూడి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలోనే జాయిన్ అయ్యేలా కృషి చేయాలని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వెల్ఫేర్ అసిస్టెంట్లకు, కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మండలంలో గల 81 అంగన్‌వాడీ కేంద్రాల నుంచి 273 మంది చిన్నారులు ఒకటో తరగతిలో జాయిన్ అవుతారని, వారిలో 123 మంది ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు విల్లింగ్ ఇచ్చారన్నారు. మిగిలిన వారిని కూడా ప్రోత్సహించి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా కృషి చేయాలన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



పెదపూడి సత్యసాయి సేవాసమితి ఆశ్రమంలో ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న జానకి

పెదపూడి: ప్రతి ఒక్కరూ శ్రద్ధతో ధ్యానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని కాకినాడ రామచంద్రమిషన్ ప్రతినిధి జానకి తెలిపారు. పెదపూడి సత్యసాయి సేవా సమితి ఆశ్రమంలో కాకినాడ రామచంద్ర మిషన్ వారి ధ్యానోత్సవం రెండో రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ వారు చేసే వృత్తులు, పనిపాట్లులో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఒత్తిడి ద్వారా వారు మానసికంగా, శారీరకంగా అనారోగ్యానికి గురవుతున్నారని ఆ ఒత్తిడి నుంచి దూరంగా ఉండి సంపూర్ణ ఆరోగ్యం పొందడానికి ధ్యానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజు, స్థానిక సేవా సమితి కన్వీనర్ మార్ని సత్యనారాయణ, సేవాదళ్ ప్రతినిధులు లొల్ల శ్రీరామమూర్తి, ముమ్మారెడ్డి పట్టాభి, బొడ్డు హరికృష్ణ, రామచంద్రమిషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'గాయత్రీ'లో ఉత్తమ ఫలితాలు



అతిథులను సన్మానిస్తున్న యాజమాన్యం

రాజానగరం: కానవరంలో ఉన్న గాయత్రీ విద్యాసంస్థల 11వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తిరుమల విద్యా సంస్థల అధినేత నున్న తిరుమలరావు, ఆది కవి నన్నయ యూనివర్సిటీ అధ్యాపకులు మల్లిడి అమ్మిరెడ్డి మాట్లాడుతూ క్వాలిటీ విద్యను అందించడం ద్వారా గాయత్రీ విద్యా సంస్థలు ఉత్తమ ఫలితాలను అందుకుంటున్నాయన్నారు. ఇంటర్ సెకండియర్‌లో స్టేట్ ఫోర్త్ ర్యాంకును అందుకున్న విద్యార్థితోపాటు ఉత్తమ ప్రతిభను కనబర్చిన ఇతర విద్యార్థులను కూడా మెమెంటోలు అందజేసి, అభినందించారు. అనంతరం గాయత్రీ యాజమాన్యం అతిథులను దుశ్శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేసింది. గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

పాస్కా జాగరణ ప్రార్థనలు

కోరుకొండ: స్థానిక ఎస్సార్‌నగర్ ఆర్‌సీఎం చర్చిలో శనివారం రాత్రి పాస్కా జాగరణ పండగను నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ మాణిక్యం ఆధ్వ ర్యంలో రాత్రి 10 గంటల నుంచి ఆదివారం ఉదయం 1.30 గంటల వరకూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా హోలీ వాటర్, పాస్కా కొవ్వొత్తిని తయారు చేసి, అందరికీ పంపిణీ చేశారు. ఉపదేశులు బెల్లపు డేవిడ్, జ్ఞానేశ్, పెద్దలు బూసి వసంత్, వరమ్మ, అమ్మాజీ, సంధ్యారాణి, శామ్యూల్ విక్టర్, పాల్గొన్నారు.

నేడు ఆస్తి పన్ను చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు

రాజమహేంద్రవరం సిటీ: గత ఏడాది ఆర్థిక సంవత్సరంలో బకాయి ఉన్న పన్నులపై వడ్డీ రాయితీ 50శాతం, అలాగే 2025–26 ఆర్థిక సంవత్సరం పన్ను ఏక మొత్తంగా చెల్లించిన వారికి పన్నులో 5 శాతం రాయితీ ఇస్తూ ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కేతన్ గార్గ్ శనివారం విజ్ఞప్తి చేశారు. ఆదివారం సెలవు రోజైనప్పటికీ చెల్లింపుదారుల సౌకర్యం కోసం నగరపాలక సంస్థలో ఉన్న ట్రెజరీ, అదనపు కౌంటర్లు తెరచి ఉంచామన్నారు. వీఎల్ పురంలోని సచివాలయం–23, ప్రకాష్ నగర్ మీసేవాలో 14, సీతంపేట మీసేవాలో 81, కోటిపల్లి బస్టాండు మీసేవాలో 36, నారాయణపురం సచివాలయం–3, బొగ్గులదిబ్బ సచివాలయం –42, బర్మా కాలనీ సచివాలయం– 89 యథావిధిగా పనిచేస్తాయని తెలిపారు.

రబీ వరి కోతలు ముమ్మరం

- 80 శాతం పూర్తయిన దాళ్వా పంట
- దళారుల దందాతో నష్టపోతున్న రైతులు



రబీ వరికోతలు కోస్తున్న మెషీన్

మధురపూడి: రబీ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు కోత పనుల్లో బిజీగా ఉన్నారు. మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలో ఇప్పటికి 80 శాతం పూర్తయ్యాయి. జిల్లాలో 58,586 హెక్టార్లలో రబీ సాగు చేయగా, 13,549 హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయి. కాగా రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో 18,350 హెక్టార్లలో సాధారణ విస్తీర్ణం ఉండగా, 85 శాతం వరికోతలు జరిగాయి. రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లోని రబీలో రైతన్నలు ఎంటీయూ 1121, 115 6, ఆర్‌ఎన్‌ఆర్ 15048 వరి రకాలను సాగు చేశారు. కోరుకొండ, సీతానగరం మండలాల్లో 80 శాతం కోతలు జరిగాయి. ఇక్కడ పూర్తి వర్షాధారమైన భూములు ఉండడంతో రబీ ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో రైతులు ఈ రకాలను ఎంపిక చేసుకున్నారు. వీటిలో గ్రేడ్–ఏ రకంగా(సన్నాలు) ఆర్‌ఎన్‌ఆర్ 15048 ఉంది. మిగిలినవన్నీ సాధారణ రకాలే ఉన్నాయి. ప్రస్తుతం ఇతర దేశాలకు సన్నరకాల ధాన్యం ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో సన్నరకాలైన ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకాన్ని కొనుగోలు చేయడానికి మిల్లర్లు ఆసక్తి చూపడం లేదు. కొనుగోలు విషయమై కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమివ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే కోరుకొండ మండలం గాదరాడ గ్రామానికి చెందిన రైతులు కల్తీ విత్తనాలిచ్చిన వ్యాపార సంస్థను తప్పు పడుతూ ఆందోళన చేశారు. కోరుకొండలోని ఓ సంస్థ ద్వారా ఆర్‌ఎస్‌ఆర్ విత్తనాలను కొనుగోలు చేసి, రైతులు సాగు చేశారు. అవి నకిలీ విత్తనాలు కావడంతో ముందే ఈనిక దశకు చేరాయి. రెండు నెలల తర్వాత రావల్సిన ఈనిక దశ ముందే రావడంతో గింజలు పాలిపోయాయని రైతులు ఆందోళన చేశారు. ఈ సమస్య అలాగే ఉంది.

కొనుగోలులో అలసత్వం

ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్న ప్రభుత్వం ధాన్యం కొనుగోలుపై అశ్రద్ధ వహిస్తోంది. రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు ప్రక్రియ జరగడం లేదు. దళారుల దందా సాగుతోంది. రైతు సేవా కేంద్రాల ముసుగులో దళారులు రైతులను మోసం చేస్తున్నారు. వ్యవసాయ శాఖాధికారుల సమాచారంతో మిల్లర్లకు అమ్మిన రైతులకు నగదు ఆలస్యంగా అందుతోంది. కనీసం 20 నుంచి 30 రోజులు సమయం పట్టడంతో రైతన్నలు బయట మార్కెట్‌కు అమ్ముతున్నారు. దీన్ని దళారులు అవకాశంగా తీసుకుని 75 కేజీల ఏ గ్రేడ్ ధాన్యానికి కేవలం రూ.1400 నుంచి 1600 మాత్రమే ఇస్తున్నారు. తేమ ఉన్న ధాన్యాన్ని కొంటున్నామంటూ సకాలంలో నగదు ఇవ్వడం లేదు. దీంతో కౌలు, సన్న, చిన్నకారు రైతులు అవస్థలు పడుతున్నారు.

తేమశాతం 17కు మించరాదు



రైతులు ధాన్యంలో తేమ శాతం 17కు మించ కుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తేమ శాతం ఎక్కువగా ఉంటే ధాన్యం పాడవుతోంది. దాళ్వా సాగులో తేమ శాతం తక్కువగా ఉండేలా చూసుకోవాలి. యాజమాన్య పద్ధతులను అనుసరించడం ద్వారా దిగుబడి పెరగడంతో పాటు, రైతులకు లాభదాయకంగా ఉంటుంది.

– ఎ.గౌరీదేవి, వ్యవసాయ శాఖ మండలాధికారి, కోరుకొండ

దళారులకు అవకాశం



దళారులు లాభాలను ఆర్జిస్తున్నారు. రైతులు నష్టపోతున్నారు. ఏ గ్రేడ్ రకానికి రూ.2,320, సాధారణ రకాలకు రూ.2,300 ధరను కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సక్రమంగా కొనుగోళ్లు లేక దళారులు ఇష్టం వచ్చినట్టుగా వ్యవహరిస్తున్నారు. 75 కేజీల ధాన్యానికి రూ.1300 నుంచి రూ.1550 వరకూ రైతులకు ఇస్తున్నారు. పచ్చిది, ఆరబెట్టాలనే కారణాలతో తక్కువ ధర ఇస్తున్నారు.

– టి.ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, రైతు

రైతులకు నష్టం



కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా రైతులకు నష్టం కలుగుతోంది. ధాన్యం కొనుగోలను ఆలస్యంగా ప్రారంభించింది. కొనుగోలు కూడా సక్రమంగా చేపట్టడంలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు నుంచి ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు జరిగేది. నగదు చెల్లింపును వేగంగా ఉండేవి. కాగా ప్రస్తుతం నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులుండడంతో వ్యవసాయం చేసి నష్టపోతున్నాం.

– కంటే వినయ్‌తేజ, రైతు నాయకుడు

ఉపాధి కూలీల ఆందోళన



వేతనాలు చెల్లించాలంటూ రాజానగరంలో ర్యాలీ చేస్తున్న కూలీలు

రాజానగరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) ద్వారా పనులు చేస్తున్న కూలీలకు గత మూడు నెలల వేతనాల చెల్లింపులు జరుగకపోవడాన్ని నిరసిస్తూ రాజానగరంలో శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని అంతా తూర్పారా పట్టారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జనిపెల్ల సత్తిబాబు మాట్లాడుతూ గాంధీ మహాత్ముని పేరుతో నిర్వహిస్తున్న ఈ పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించలేక, పాలకులు నీరుకారుస్తున్నారని విమర్శించారు. గతంలో కూలీలను ఎప్పటికప్పుడు వేతనాలు చెల్లించడంతో పాటు పనిముట్లకు, వేసవిలో సదుపాయాలకు సొమ్ములు కూడా ఇచ్చేవారని గుర్తు చేశారు. ఇప్పుడు అటువంటి అదనపు సదుపాయాల మాట దేవుడెరుగు, చేసిన పనికే వేతనాలు ఇవ్వని పరిస్థితులలో ప్రభుత్వాలు ఉండటం సిగ్గు చేటన్నారు. తక్షణమే కూలీల వేతన బకాయిలను చెల్లించి, ఆదుకోవాలని, లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలతోపాటు సంఘ ప్రతినిధులు పి.వెంకట్‌నాయుడు, చిరుకూరు నాగమ్మ, షేక్ ఆందాబీ, అబ్బులు, వరలక్ష్మి, పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలను నిర్మూలించాలి



గొల్లలమామిడాడలో ఈ వేస్ట్ సేకరణ కౌంటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు



రంగంపేట గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ గిరి

రంగంపేట: ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.వి. గిరి సూచించారు. స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో శనివారం పంచాయితీ కార్యదర్శి వెలిచేటి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు తమ వద్ద ఉన్న పాడైపోయిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పంచాయతీలకు అందించాలన్నారు. గ్రామంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఎంపీడీఓ వి.వీరసాయిబాబా, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెదపూడి: గ్రామాల్లో పనికిరాని ఎలక్ట్రానిక్ (ఈ వేస్ట్) వస్తువులను సేకరించాలని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి సూచించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో శనివారం ఈ వేస్ట్ సేకరించే కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా రామేశ్వరం, పెదపూడి, గొల్లలమామిడాడ గ్రామాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఈ వేస్ట్‌ను సేకరిస్తున్నామన్నారు. తహసీల్దార్ సీతాపతిరావు, డిప్యూటీ ఎంపీడీఓ ఎంఎస్ఎన్ రెడ్డితో కలసి గొల్లలమామిడాడ ఈ వేస్ట్ సేకరణ కౌంటర్‌ను పరిశీలించారు.

కోరుకొండ: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం సాధించగలమని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. శనివారం కాపవరంలో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. కాపవరం మాజీ సర్పంచ్ తెలగంశెట్టి శ్రీను, బూరుగుపూడిసొసైటీ చైర్మెన్ కంటే నాగేశ్వరా వు, కంటే గణపతి పాల్గొన్నారు.

రాజానగరం: మన ఇంటిని ఏవిధంగా పరిశుభ్రంగా చూసుకుంటామో, అలాగే పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉండేలా చూస్తే వాతావరణం కలుషితం కాకుండా ప్రజారోగ్యం బాగుంటుందని స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న 'స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా రాజానగరంలోని గాంధీ బొమ్మ కూడలిలో చీపురు పట్టి, రోడ్ల శుభ్రతను చేపట్టారు. అనంతరం పంచాయతీలోని పారిశుధ్య సిబ్బందికి నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జెప ఝాన్సీ, తహసీల్దారు జీఎఎల్ఎస్ దేవి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. అలాగే లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో నెలకొన్న వివిధ సమస్యలను రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కమిషన్ కేతన్ గార్గె దృష్టికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తీసుకువెళ్లారు. శనివారం ఆయనను కలుసుకుని రాజానగరం నియోజకవర్గంలో సమస్యలను వివరించారు.

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఈ–వేస్ట్ కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో పీహెచ్‌సీ పరిసరాలు, లోపలి గదులు, కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్లు కె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్ ఎం సుధామయి సమక్షంలో ఈ–వేస్ట్ కార్యక్రమం నిర్వహించారు.

సామూహిక సీమంతాలు



పందలపాకలో గర్భిణులకు పోష్టికాహారం అందిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద సామూహిక సీమంతాలు నిర్వహించారు. శనివారం పంచాయతీ వద్ద స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని ఐసీడీఎస్ నిర్వహించి షోషణ్ పక్వాడ కార్యక్రమంలోని గర్భిణులకు సామూహిక సీమంతులు, అక్షర అభ్యాసం నిర్వహించి పుస్తకాలను చిన్నారులు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న షోష్టికాహారం గర్భిణులు తీసుకోవాలన్నారు. ఆరోగ్యవంతమైన బిడ్డ కోసం ఆహార నియామాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలోని ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మి, సూపర్ వైజర్ శాంత్రి రత్నకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది, సర్పంచ్ సబ్బారపు పద్మావతి, ఉప సర్పంచి పడాల వెంకటరామారెడ్డి,మాజీ ఎంపీటీసీ సబ్బెళ్ల విజయభాస్కర్‌రెడ్డి,ఎంపీపీ తేతలి సుమ, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పందలపాక ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులు స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పీడీ దార్వంపూడి యువరాజారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేశారు.

నిరంతర సాధనతో ఉజ్వల భవిష్యత్తు



చంద్రేడు హైస్కూల్లో జరిగిన సభలో మాట్లాడుతున్న హెచ్‌ఎం రమణబాబు

రంగంపేట: విద్యార్థులు నిరంతర సాధన చేస్తే ఉజ్వల భవిష్యత్తు పొందవచ్చని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గంటా రమణబాబు అన్నారు. శనివారం చంద్రేడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు పదిలోకి స్వాగత కార్యక్రమం సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, చదువు నేర్పిన గురువులకు మంచి పేరు తేవడానికి ఉత్తమ ఫలితాలతో పాటు ఉన్నత విలువలు కూడా ఎంతో అవసరమని దీనికి విద్యార్థులు చైతన్యవంతులు కావాలని ఆయన కోరారు. రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అద్భుత ఉత్తీర్ణత సాధిస్తున్న విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకుని ప్రభుత్వ విద్యాలయాల్లో చేరడానికి ప్రతీ ఒక్కరూ సన్నద్ధులు కావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



శ్రావణిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శనివారం విద్యార్థులను అభినందించారు. శనివారం శ్రీ పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణ ఏర్పాటు చేసి ఈ కార్యక్రమంలోని హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియెట్ పరీక్షలో సీఈసీలో స్టేట్ టాపర్ నిలిచిన రుత్తల లీలా శ్రావణి, ఎంపీసీలో కాలేజ్ టాపర్ నిలిచిన పాలమూరి దేవిలను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండల అధికారులు, ప్రజా ప్రతినిధులందూరు ప్రభుత్వం పాఠశాలలో విద్యార్థులు మంచి మార్కులు సాధించడం ద్వారా మరింత విద్యార్థులకు ఆదర్శ నిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలోని పాఠశాల హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ కృష్ణ, సర్పంచి సబ్బారపు పద్మావతి, ఎంపీపీ తేతలి సుమ, ఉప సర్పంచి పడాల వెంకటరామారెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కొనాల సత్తిరాజు, పీడీ దార్వంపూడి యువరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు సాగు చేయాలి

పెరవలి: భావి తరాల భవిష్యత్తు కోసం, భూసారాన్ని పెంచడం కోసం ప్రతి ఒక్కరూ సేంద్రియ వ్యవసాయం చేపట్టాలని జిల్లా కో ఆర్డినేటర్ సాకా రామకృష్ణ తెలిపారు. మండలంలోని మల్లేశ్వరం, కాపవరం గ్రామాల్లో వెలుగు సిబ్బంది, రైతులతో శనివారం సేంద్రియ వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించి, నవధాన్యాల కిట్లను అందించి ఉత్తమ రైతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే సేంద్రియ వ్యవసాయం 45 వేల ఎకరాలకు చేరింది. ఇది మరింత పెరగాలని తెలిపారు. పంట భూములు సురక్షితంగా ఉండాలంటే ఇప్పటి నుంచి సేంద్రియ వ్యవసాయం ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. రసాయన ఎరువుల వినియోగంతో పంట భూములు క్రమేణా సారం కోల్పోతాయని వివరించారు. భూసారం వృద్ధికి రైతులు మూడవ పంటగా చిరు ధాన్యాలను సాగు చేయాలని సూచించారు. పచ్చిరొట్ట పైర్లు సాగుకి మండలంలో ఖండవల్లి, ముక్కామల, కాపవరం, మల్లేశ్వరం, పెరవలి గ్రామాలను ఎంపిక చేసి 30 రకాల చిరు ధాన్యాల విత్తనాలను అందిస్తున్నామన్నారు.

ప్రజలకు చేరువగా వాట్సాప్ గవర్నెన్స్

జిల్లా కలెక్టర్ ప్రశాంతి



వాట్సాప్ గవర్నెన్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల, కలెక్టర్ ప్రశాంతి, కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరవ చేసేందుకు ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ 95523 00009 నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. బొమ్మూరులోని వైటీసీ ప్రాంగణంలో ఈ–వ్యర్థాల అవగాహన కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నగరపాకలసంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్‌లతో కలిసి వాట్సాప్ గవర్నెన్స్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకి అందజేస్తున్న వివిధ పౌర సేవలు మరింతగా చేరువ చేసే క్రమంలో వాట్సాప్ గవర్నెన్స్ 95523 00009 నంబర్ తీసుకువచ్చామని, మీసేవా, వార్డు సచివాలయంల ద్వారా పొంది అన్ని రకాల సేవలను ఈ వాట్సాప్ నంబర్ ద్వారా పొందవచ్చన్నారు. జిల్లా స్థాయి అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

బుర్రిలంకలో అగ్ని ప్రమాదం



బాధితులకు సాయం అందజేస్తున్న రాంజీ తదితరులు

కడియం: కడియపులంక పంచాయతీ పరిధిలోని బుర్రిలంకలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో పి.కొండారత్నం, ఎం.త్రివేణిలకు చెందిన రెండు ఇళ్లు కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రెండు లక్షలకు పైగా ఆస్తినష్టం సంభవించిందని బాధితులు తెలిపారు. ప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణమని చెబుతున్నారు. కాగా స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రాన్ని సమాచారం ఇవ్వడంతో వారు సంఘన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. బాధిత కుటుంబాలను పరామర్శించి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ రూ.10వేలు, స్థానికులు నూనె ప్రభు రూ.5వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కొవ్వూరు: దొమ్మేరు గ్రామానికి చెందిన లంక నాగ శ్రీసత్య సాయికుమార్ (22) శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయికుమార్ ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతున్నట్లు బంధువులు చెబుతున్నారు. తల్లిదండ్రులిద్దరూ ఆసుపత్రి పనిపై బయటికి వెళ్లారు. దీంతో ఇంట్లో ఎవరి లేకపోవడంతో రాత్రి తొమ్మిది గంటల సమయంలో సాయికుమార్ గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటికి వచ్చిన స్నేహితుడు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ పి.విశ్వం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. సాయికుమార్ ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

తెలుగుజాతికే గర్వకారణం సర్దార్ గౌతు లచ్చన్న

- జయంతి, వర్ధంతులను అధికారికంగా జరపాల్సిన అవసరముంది
- వర్ధంతి కార్యక్రమంలో నివాళులర్పించిన మాజీ ఎంపీ భరత్



గౌతు లచ్చన్న వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న మార్గాని భరత్



గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న గూడూరి శ్రీనివాస్

సీటీఆర్ఐ : సర్దార్ గౌతు లచ్చన్న యావత్ తెలుగు జాతికి గర్వకారణమైన వ్యక్తి అని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ అన్నారు. ఆ మహనీయుని జయంతి, వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా గౌడ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యాన రాజమహేంద్రవరంలోని వైజంక్షన్ వద్ద ఉన్న లచ్చన్న విగ్రహం దగ్గర జరిగిన కార్యక్రమంలో భరత్ పాల్గొని, పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న సమర యోధుడు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తిగా గౌతు లచ్చన్న జీవితం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

గీతకులాలకు ఆరాధ్యదైవం గౌతు లచ్చన్న

అనంతరం రాజమహేంద్రవరం గోదావరి గట్టు దగ్గర ఉన్న గౌతు లచ్చన్న విగ్రహం దగ్గర వైఎస్సార్‌సీపీ నాయకుడు వాసంశెట్టి గంగాధరరావు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ భరత్ పాల్గొని లచ్చన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గౌతు లచ్చన్న చిరస్మరణీయుడు

సర్దార్ గౌతు లచ్చన్న చిరస్మరణీయుడని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కొనియాడారు. స్థానిక వై జంక్షన్, గోదారి గట్టున ఉన్న వాటర్ వర్క్స్ సమీపంలో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాలకు పూలమాలలు వేసి శనివారం ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డి రాజు, క్రైడె చైర్మెన్ బుడ్డిగ శ్రీనివాస్, మార్గాని చంటిబాబు, కోడి ప్రవీణ్, పెంకే సురేష్, వాసంశెట్టి గంగాధర్, సప్పా ఆదినారాయణ, బిల్డర్ చిన్న, కడియాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతిలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొని నివాళులర్పించారు.